నమస్తే తెలంగాణ
సంగారెడ్డి
11 | హైదరాబాద్, గురువారం 29 ఫిబ్రవరి 2024 | SANGAREDDY

క్రైస్తవులకు అండగా నిలుస్తాం

క్రైస్తవ సంఘాల ప్రతినిధులతో సీఎం రేవంత్‌రెడ్డి

హైదరాబాద్, ఫిబ్రవరి 28 (నమస్తే తెలంగాణ): క్రైస్తవులకు అండగా నిలుస్తామని, త్వరలో మెదక్ చర్చిని సందర్శిస్తామని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. మెదక్ డయాసిస్ బిషప్ పద్మారావుతో పాటు వివిధ చర్చిలకు చెందిన క్రైస్తవ సంఘాల ప్రతినిధులు, ఇండిపెండెంట్ చర్చిల ప్రతినిధులు బుధవారం సచివాలయంలో సీఎంను కలిశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. చర్చిల ఆస్తులకు రక్షణ కల్పిస్తామని, కొత్త చర్చిల నిర్మాణానికి అనుమతులు సులభతరం చేస్తామని హామీ ఇచ్చారు. క్రైస్తవుల శ్మశాన వాటికలకు అవసరమైన స్థలం కేటాయిస్తామన్నారు. పీసీసీ అధ్యక్షుడి హోదాలో ఎన్నికలకు ముందు మెదక్ చర్చిని సందర్శించానని, మరోసారి చర్చిని సందర్శిస్తానని తెలిపారు. తమ ప్రభుత్వంలో మతపరమైన స్వేచ్ఛ ఉంటుందన్నారు. తెలంగాణలో మాదిరిగా కేంద్రంలోనూ లౌకిక ప్రభుత్వం ఏర్పడటానికి సహకరించాలని కోరారు. కార్యక్రమంలో రెవరెండ్ జాన్‌జార్జ్, డాక్టర్ ఏఎంజే కుమార్, శ్యామ్ అబ్రహం, అనిల్ థామస్ పాల్గొన్నారు.


అమ్మవారిని దర్శించుకుంటున్న ఎమ్మెల్యే సునీతాలక్ష్మారెడ్డి, బీఆర్ఎస్ నాయకులు

అమ్మవు నీవే..

ఘనంగా ప్రారంభమైన బగలాముఖి శక్తిపీఠం ప్రథమ వార్షికోత్సవం

- పెద్దఎత్తున హాజరైన భక్తులు
- సాయంత్రం పల్లకీసేవకు మహిళల మంగళ నీరాజనం
- ముఖ్య అతిథులుగా హాజరైన లలితా త్రిపుర సుందరీదేవి పీఠాధిపతి బ్రహ్మానంద సరస్వతిస్వామి, ఎమ్మెల్యే సునీతాలక్ష్మారెడ్డి

శివ్వంపేట, ఫిబ్రవరి 28: మెదక్ జిల్లా శివ్వంపేటలో బగలాముఖి శక్తిపీఠం ప్రథమ వార్షికోత్సవం బుధవారం అమ్మవారి ఉపాసకులు శాస్త్రుల వెంకటేశ్వరశర్మ ఆధ్వర్యంలో ఘనంగా ప్రారంభమయ్యాయి. ముందుగా జ్యోతి ప్రజ్వలన చేసి గోపూజ, గణపతిపూజ, పుణ్యాహవచనం, అగ్నిప్రతిష్ఠ, లక్ష హరిద్రార్చన, 108 మంది సువాసినులతో అమ్మవారికి పసుపార్చన వంటి కార్యక్రమాలు నిర్వహించారు. ముఖ్య అతిథులుగా హాజరైన లలితా త్రిపుర సుందరీదేవి పీఠాధిపతి బ్రహ్మానంద సరస్వతిస్వామి భక్తులకు ప్రవచనాలు బోధించారు.

ఆకట్టుకున్న భరతనాట్య ప్రదర్శన

ఆలయంలో హైదరాబాద్ శ్రీరామదాసు భరతనాట్య అకాడమీకి చెందిన డాక్టర్ ప్రియాంక భరతనాట్య ప్రదర్శన భక్తులను విశేషంగా ఆకట్టుకున్నది. సాయంత్రం ఆలయం చుట్టూ పల్లకీసేవ నిర్వహించారు. శక్తిపీఠం ట్రస్టు సభ్యుడు, జడ్పీటీసీ పబ్బమ హేశ్ గుప్తా ఆధ్వర్యంలో ఆలయాన్ని అందంగా ముస్తాబు చేశారు. భక్తుల సౌకర్యార్థం షామియానాలు, టెంట్లు, తాగునీటి సౌకర్యం, పూల ద్వారాలు ఏర్పాటు చేశారు. దుబాయ్‌కు చెందిన రమ్య అయ్యప్ప దంపతులు అమ్మవారికి రూ.1.50 లక్షల విలువ చేసే పల్లకీసేవను బహూకరించారు. బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు చాగండ్ల నరేంద్రనాథ్ ఆధ్వర్యంలో భక్తులకు మొదటిరోజు అన్నదానం చేశారు. ఉత్సవాల్లో ఎమ్మెల్యే సునీతాలక్ష్మారెడ్డి, హైకోర్టు సీనియర్ న్యాయవాది శివకుమార్‌గౌడ్, కాంగ్రెస్ నాయకుడు నీలం మధు ముదిరాజ్, మాజీ సర్పంచ్ పత్రాల శ్రీనివాస్‌గౌడ్, బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు పబ్బరమేశ్ గుప్తా, చాగండ్ల బల్వేందర్‌నాథ్, సింగాయపల్లి గోపి, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు రమణాగౌడ్, బీఆర్‌టీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి సిలువేరి వీరేశం, తూము కృష్ణారావు, జ్ఞానేశ్వర్, తహసీల్దార్ శ్రీనివాస్‌చారి దంపతులు, వంజరి కొండల్, పోచాగౌడ్ పాల్గొన్నారు.

సంతోషంగా ఉంది: వెంకటేశ్వరశర్మ

శాస్త్రుల వెంకటేశ్వరశర్మ మాట్లాడుతూ.. అనతి కాలంలోనే బగలాముఖి శక్తిపీఠానికి గొప్ప గుర్తింపు రావడం శుభసూచికమని, అంతా అమ్మవారి కృప అన్నారు. అందరిలో భక్తిభావం మరింత పెరగాలని, బగలాముఖి అమ్మవారిని నిత్యం స్మరించుకుంటే అంతా మంచి జరుగుతుందన్నారు. రెండోరోజు గురువారం మరిన్ని ముఖ్యమైన పూజా కార్యక్రమాలు జరుగుతాయని, భక్తులు హాజరుకావాలని కోరారు.

లక్ష హరిద్రార్చన అనంతరం అమ్మవారి సన్నిధిలో భరతనాట్యం ప్రదర్శిస్తున్న డాక్టర్ ప్రియాంక

అక్షయ పాత్రకు రూ.2లక్షల చెక్కును విరాళంగా అందజేస్తున్న ఎన్వీ రమణ

అక్షయపాత్ర ఫౌండేషన్ కిషెన్ షెడ్‌ను పరిశీలిస్తున్న ఎన్వీ రమణ దంపతులు

పౌష్టికాహార లోపాన్ని రూపుమాపుదాం

సుప్రీంకోర్టు మాజీ ప్రధాన న్యాయమూర్తి ఎన్వీ రమణ

కంది, ఫిబ్రవరి 28: మనదేశంలో పౌష్టికాహార లోపాన్ని రూపుమాపాల్సిన అవసరం ఉందని, ఆ దిశగా అక్షయపాత్ర ఫౌండేషన్ ఒక మంచి లక్ష్యంతో సమాజానికి అందిస్తున్న సేవలు అమోఘమని సుప్రీంకోర్టు మాజీ ప్రధాన న్యాయమూర్తి ఎన్వీ రమణ అన్నారు. బుధవారం సంగారెడ్డి జిల్లా కంది మండల కేంద్రంలోని అక్షయపాత్ర ఫౌండేషన్‌లో 15వ వార్షికోత్సవ వేడుకలకు ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతూ.. స్వాతంత్ర్యం వచ్చి ఇన్నేండ్లయినా మన దేశంలో 7.7 శాతం మంది బాలబాలికలు పౌష్టికాహార లోపంతో బాధపడుతుండడం ఆవేదన కలిగిస్తున్నదన్నారు. హరిత విప్లవం విజయవంతమైనా పోషకాహార లోపం సమస్య నేటికీ ఉండడం ఆరోగ్యకర సమాజ నిర్మాణానికి అడ్డు అన్నారు. అక్షయ పాత్ర ద్వారా ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న పిల్లలకు కావాల్సిన పోషకాహారాన్ని అందిస్తూ, ఆ లోపాన్ని తొలిస్తున్నదని అభినందించారు. శాంతియుత, సుసంపన్నమైన సమాజాలు మొదట ఆకలి వంటి జీవన అవసరాలు పరిష్కరించడం ద్వారా మాత్రమే సాధించబడుతాయన్నారు. ఇందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అక్షయ పాత్ర ఫౌండేషన్ వంటి లాభాపేక్ష లేని సంస్థలను ప్రోత్సహించాలని కోరారు. అన్ని ప్రభుత్వాలు చేయలేవని, ప్రతి పౌరుడు బాధ్యతగా వ్యవహరించి పౌష్టికాహార లోపాన్ని రూపుమాపాలని పిలుపునిచ్చారు. తనవంతుగా అక్షయ పాత్రకు ఎన్వీ రమణ రూ.2 లక్షల చెక్కును అందజేశారు. అంతకుముందు అక్షయపాత్ర భోజన తయారీలో నాణ్యతను పెంచే రెండు ఆటోమేటెడ్ రైస్‌వాషింగ్ మిషన్లు, కర్రీ తయారీకి ఉపయోగించే యంత్రాలు, పాత్రలను శుభ్రపరిచే యంత్రాలను ప్రారంభించారు. అక్షయ పాత్ర సేవలందిస్తున్న ప్రభుత్వ పాఠశాలల్లోని ప్రతిభావంతులైన విద్యార్థులు, ఉపాధ్యాయులను సత్కరించి అభినందించారు. కార్యక్రమంలో అక్షయపాత్ర ఫౌండేషన్ చైర్మన్ మధు పండిత దాస, హైదరాబాద్ ట్రస్టీ, ప్రాంతీయ అధ్యక్షులు సత్యగౌర చంద్ర తదితరులు పాల్గొన్నారు.

రాహుల్ రాజ్

మెదక్ కలెక్టర్‌గా రాహుల్ రాజ్

- రాజర్షి షా ఆదిలాబాద్‌కు బదిలీ
- ఉమ్మడి మెదక్ జిల్లాలో పలువురు అధికారుల బదిలీ

మెదక్, ఫిబ్రవరి 28(నమస్తే తెలంగాణ): మెదక్ జిల్లా కలెక్టర్ రాజర్షి షా ఆదిలాబాద్ జిల్లాకు బదిలీ అయ్యారు. ఆయన స్థానంలో ఆదిలాబాద్ జిల్లా కలెక్టర్‌గా పనిచేస్తున్న రాహుల్‌రాజ్‌ను మెదక్ కలెక్టర్‌గా నియమిస్తూ రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ రాజర్షి షా మాట్లాడుతూ.. గతేడాది ఫిబ్రవరిలో మెదక్ జిల్లాకు కలెక్టర్‌గా వచ్చానని, ఏడాది కాలం జిల్లాలో పనిచేయడం ఆనందంగా ఉందన్నారు. జిల్లాస్థాయి అధికారులు, ప్రజాప్రతినిధుల సహకారంతో జిల్లాను అన్నిరంగాల్లో అభివృద్ధి చేశానని గుర్తుచేశారు.

మెదక్ ఆర్డీవో బదిలీ

మెదక్ ఆర్డీవో అంబదాస్ రాజేశ్వర్ ఆదిలాబాద్ ఆర్డీవోగా బదిలీపై వెళ్లారు. భూపాలపల్లి ఆర్డీవోగా పనిచేస్తున్న కె.రమాదేవి మెదక్ ఆర్డీవోగా రానున్నారు. ఈ మేరకు ప్రభుత్వ ప్రిన్సిపల్ సెక్రటరీ నవీన్‌మిట్టల్ బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు.

నారాయణఖేడ్ ఆర్డీవో బదిలీ

నారాయణఖేడ్, ఫిబ్రవరి 28: 'ఖేడ్' ఆర్డీవో వెంకటేశ్ బదిలీ అయ్యారు. వెంకటేశ్‌ను హనుమకొండ ఆర్డీవోగా బదిలీ చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఆయన స్థానంలో కల్లూరు ఆర్డీవో అశోక చక్రవర్తి ఇక్కడికి బదిలీపై రానున్నారు. ఆరు నెలల క్రితం వెంకటేశ్ ఇక్కడికి బదిలీపై వచ్చారు.

ఎన్నికలకు అధికారులు సిద్ధంగా ఉండాలి

సంగారెడ్డి, ఫిబ్రవరి 28: పార్లమెంట్ ఎన్నికల దృష్ట్యా అధికారులంతా సిద్ధంగా ఉండాలని ఎస్పీ చెన్నూరి రూపేశ్ అన్నారు. బుధవారం జిల్లా పరిషత్ కార్యాలయంలో పోలీసు అధికారులతో సమీక్షాసమావేశం నిర్వహించారు. పోలీసు స్టేషన్లలో పెండింగ్‌లో ఉన్న గ్రేవ్, నాన్ గ్రేవ్ కేసుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. దర్యాప్తును త్వరితగతిన పూర్తి చేసి నేరస్తులను న్యాయస్థానం ఎదుట హాజరుపర్చాలన్నారు. ప్రతి కేసులో ప్లాన్ ఆఫ్ యాక్షన్ ఉండాలని, వచ్చేనెల 9న జరగనున్న జాతీయ లోక్ అదాలత్‌లో వీలైనన్ని ఎక్కువ కేసులు పరిష్కారమయ్యే విధంగా చూడాలన్నారు. ఎన్నికల నోటిఫికేషన్ వచ్చిన నాటి నుంచి ఎన్నికల కమిషన్ ఆధీనంలో విధులు నిర్వహించాల్సి ఉంటుందన్నారు. విధి నిర్వహణలో ఎవరూ అలసత్వం చూపించవద్దని సూచించారు. చెక్ పోస్టుల వద్ద ముమ్మరంగా తనిఖీలు చేపట్టి అక్రమ రవాణాకు తావులేకుండా చూడాలన్నారు. సమావేశంలో అదనపు ఎస్పీ సంజీవరావు, డీఎస్పీలు సత్యయ్యగౌడ్, డీఎస్పీ వెంకట్‌రెడ్డి, రవీందర్‌రెడ్డి, డీసీఆర్‌బీ ఇన్స్పెక్టర్ రమేశ్, ఎస్‌బీ ఇన్స్పెక్టర్ భాస్కర్, ఎలక్షన్ సెల్ ఇన్స్పెక్టర్ విజయకృష్ణ, సీఐలు, ఎస్ఐలు, స్టేషన్ రైటర్స్ పాల్గొన్నారు.


ఆనంద్‌స్వరూప్ శెట్కార్, దారం శంకర్‌ను సన్మానిస్తున్న ఎమ్మెల్యే సంజీవ్‌రెడ్డి

'ఖేడ్' మున్సిపల్ చైర్మన్‌గా ఆనంద్ షెట్కార్

నారాయణఖేడ్, ఫిబ్రవరి 28: సంగారెడ్డి జిల్లా నారాయణఖేడ్ మున్సిపల్ చైర్మన్‌గా 6వ వార్డు కౌన్సిలర్ ఆనంద్ స్వరూప్ షెట్కార్ ప్రమాణస్వీకారం చేసి బాధ్యతలు చేపట్టారు. ఇంతకుముందు మున్సిపల్ చైర్పర్సన్‌గా ఉన్న రుబీనాబేగం నజీబ్‌పై ఈనెల 2న ప్రవేశపెట్టిన అవిశ్వాసం నెగ్గడంతో బుధవారం నూతన పాలకవర్గాన్ని ఎన్నుకున్నారు. ఎన్నికల అధికారిగా వ్యవహరించిన ఇన్‌చార్జి ఆర్డీవో, డిప్యూటీ కలెక్టర్ వసంతకుమారి మాట్లాడుతూ.. 15 మంది కౌన్సిలర్లతో పాటు ముగ్గురు ఎక్స్‌అఫీషియో సభ్యులతో కలిపి మొత్తం 18 మందికి 11 మంది కౌన్సిలర్లు, ఒక ఎక్స్ అఫీషియో సభ్యుల మద్దతుతో చైర్మన్ ఎన్నిక ఏకగ్రీవమైందన్నారు.వైస్ చైర్మన్‌గా 3వ వార్డు కౌన్సిలర్ దారం శంకర్ ఎన్నికైనట్లు ప్రకటించారు. ఈ మేరకు చైర్మన్, వైస్ చైర్మన్లతో ప్రమాణస్వీకారం చేయించి ధ్రువీకరణ పత్రాలను అందజేశారు. ఎక్స్ అఫీషియో సభ్యునిగా హాజరైన ఎమ్మెల్యే పట్లోళ్ల సంజీవ్‌రెడ్డి మాట్లాడుతూ.. ప్రజల అవసరాలను గుర్తించి వారి సమస్యలను పరిష్కరించే దిశగా కొత్త పాలకవర్గం కృషిచేయాలని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా చైర్మన్, వైస్ చైర్మన్లను ఎమ్మెల్యే సన్మానించి అభినందించారు. మున్సిపల్ కమిషనర్ జగ్జీవన్‌తో పాటు మున్సిపల్ సిబ్బంది చైర్మన్, వైస్ చైర్మన్లను సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు.

రాయికోడ్ ఎంపీపీగా మొగులప్ప

ప్రమాణ స్వీకారం చేయిస్తున్న అధికారులు

రాయికోడ్, ఫిబ్రవరి 28: సంగారెడ్డి జిల్లా రాయికోడ్ ఎంపీపీ ఎన్నికలో అనూహ్య పరిణామాలు చోటుచేసుకున్నాయి. బుధవారం ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీపీ ఎన్నిక జరిగింది. ఎంపీపీ స్థానాన్ని దక్కించుకోవాలని కాంగ్రెస్ పార్టీ నాయకులు ఇటిక్యాపల్లి ఎంపీటీసీ పండరీని రెండు రోజుల క్రితం కాంగ్రెస్ పార్టీలో చేర్చుకున్నారు. ఎంపీపీ పదవి ఇస్తామంటూ ఆశచూపి పండరిని కాంగ్రెస్ పార్టీలో చేర్చుకున్నారు. ఎంపీపీ ఎన్నికలో బీఆర్ఎస్ ఎంపీటీసీలందరూ కాంగ్రెస్ రెబల్ అభ్యర్థి, రాయికోడ్ ఎంపీటీసీ మొగులప్పను ఎంపీపీగా ప్రతిపాదించారు. బీఆర్ఎస్‌లో గెలిచిన ఎంపీటీసీ పండరి పార్టీకి ద్రోహం చేశాడని బీఆర్ఎస్ నాయకులు మండిపడుతున్నారు. దీంతో రాయికోడ్ ఎంపీటీసీ మొగులప్ప (కాంగ్రెస్ పార్టీ రెబల్ అభ్యర్థి)ను సంప్రదించి ఎంపీపీగా ఎన్నుకున్నారు. ఇప్పటి వరకు మండల కేంద్రమైన రాయికోడ్‌కు ఎంపీపీ, జడ్పీటీసీ పదవులు రాలేదు. ఇప్పుడు రాయికోడ్‌కు ఎంపీపీ రావడంతో గ్రామస్తుందరూ సంతోషం వ్యక్తం చేస్తున్నారు. కార్యక్రమంలో జహీరాబాద్ డీఎస్పీ రామ్మోహన్‌రెడ్డి, జహీరాబాద్ రూరల్ సీఐ నవీన్‌కుమార్, ఎంపీడీవో ఫరీఫ్, తహసీల్దార్ శ్రీనివాస్, ఏఈ శశికుమార్, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

సైన్స్ కెరీర్‌తో ఉజ్వల భవిష్యత్

నోబెల్ బహుమతి గ్రహీత డాక్టర్ గ్రేగ్ ఎల్ సెమెంజా

పటాన్‌చెరు, ఫిబ్రవరి 28: సైన్స్ ఎన్నో ఆవిష్కరణలకు బాటలు వేసి, మానవాళి జీవన ప్రమాణాల మెరుగుదలకు దోహద పడుతోందని, సైన్స్‌ను కెరీర్‌గా తీసుకోవాలని వర్ధమాన శాస్త్రవేత్తలు, విద్యార్థులకు జాన్స్ హాప్‌కిన్స్ స్కూల్ ఆఫ్ మెడిసిన్‌లోని జెనిటిక్ మెడిసిన్ విభాగం ప్రొఫెసర్,నోబెల్ బహుమతి గ్రహీత డాక్టర్ గ్రేగ్ ఎల్ సెమెంజా పిలుపునిచ్చారు. హైదరాబాద్ గీతం వర్సిటీలో బుధవారం నిర్వహించిన జాతీయ సైన్స్ దినోత్సవంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. 'భారతదేశ అభివృద్ధి కోసం దేశీయ పరిజ్ఞానం' అనే ఇతివృత్తంతో నిర్వహించిన ఈ కార్యక్రమంలో గ్రేగ్ మాట్లాడుతూ.. తన పాఠశాల రోజులు, విద్యాబుద్ధులు నేర్పి ఎదిగేందుకు ఊతమిచ్చిన తన అధ్యాపకురాలు డాక్టర్ రోజస్ ఎస్.నెల్సన్‌ను ఈ సందర్భంగా ఆయన గుర్తు చేసుకున్నారు. అంతర్ విభాగ జ్ఞానాన్ని మార్చిడి చేసుకునే, సహకార వేదికలుగా తోడ్పడే సెల్ కల్చర్ ల్యాబ్, సెంట్రల్ ఇన్‌స్ట్రుమెంట్ ఫెసిలిటీ ల్యాబ్‌లను ఈ సందర్భంగా ప్రొఫెసర్ సెమెంజా ప్రారంభించారు. సుస్థిర భవిష్యత్తు కోసం హరిత కార్యక్రమంగా ఒక మొక్కను ఆయన నాటారు. ఈ తరువాత కౌటిల్య స్కూల్ ఆఫ్ పబ్లిక్ పాలసీ అధ్యాపకులతో ముఖాముఖీ సంభాషించారు. భారత శాస్త్ర సాంకేతిక విభాగం కార్యదర్శి డాక్టర్ ఎస్.చంద్రశేఖర్ అతిథిని పరిచయం చేయడంతో పాటు జాతీయ సైన్స్ దినోత్సవ ప్రాముఖ్యతను వివరించారు. గీతం హైదరాబాద్ అదనపు ఉపకులపతి ప్రొఫెసర్ డీఎస్ రావు డాక్టర్ గ్రేగ్‌ను ఘనంగా సన్మానించి జ్ఞాపికను అందజేశారు. వివిధ పాఠశాలల నుంచి 800 మంది విద్యార్థులు, గీతం అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

గీతం అధ్యాపకులతో డాక్టర్ గ్రేగ్ ఎల్ సెమెంజా

సదస్సులో పాల్గొన్న విద్యార్థులు

రక్తం చిందిన రహదారి

- రాంపూర్ క్రాసింగ్ వద్ద ఘోర రోడ్డు ప్రమాదం
- కారు, బైక్ ఢీకొని అక్కడికక్కడే ముగ్గురు దుర్మరణం
- తొమ్మిది మందికి గాయాలు

ప్రమాద తీవ్రతకు నుజ్జునుజ్జయిన కారు

నంగునూరు, ఫిబ్రవరి 28: కారు వేగంగా వచ్చి బైకును ఢీకొన్న ఘటనలో ముగ్గురు అక్కడికక్కడే దుర్మరణం చెందిన ఘటన సిద్దిపేట జిల్లా నంగునూరు మండలం రాంపూర్ క్రాసింగ్ వద్ద బుధవారం జరిగింది. స్థానికులు, పోలీసుల వివరాల ప్రకారం... బద్దిపడగ రాంపూర్ క్రాసింగ్ వద్ద శ్రీనిధి రైస్‌మిల్లు సమీపంలో కారు బైక్‌ను ఢీకొట్టింది. ఈ ఘటనలో రాంపూర్ నుంచి బద్దిపడగకు బైక్‌పై వెళ్తున్న నంగునూరు మండలం బద్దిపడగకు చెందిన కట్టె రవి(55), నాగరాజుపల్లికి చెందిన ముక్కెర ఐలయ్య (60), కారులో ప్రయాణిస్తున్న కొండపాక మండలం దుద్దెడకు చెందిన జక్కుల మమత(28) అక్కడికక్కడే మృతిచెందారు. కారులో ఉన్న మమత భర్త అనిల్, పిల్లలు భానుప్రసాద్, వైష్ణవి, అనిల్ బావమరిది బాపురాజు, భార్య కీర్తన, వారి పిల్లలు నాన్సి, హన్విక, అనిల్ అన్న కొడుకులు చరణ్, ప్రణయ్ గాయపడ్డారు. వీరిని సిద్దిపేట ప్రభుత్వ దవాఖానకు తరలించి చికిత్స అందిస్తున్నారు. అయితే కారు వేగంగా వచ్చి బైక్‌ను ఢీకొట్టి రోడ్డు పక్కన ఉన్న కాలువలో పడింది. ప్రమాద తీవ్రతకు కారు ముందుభాగం నుజ్జునుజ్జు అయ్యింది. రాజగోపాల్‌పేట ఎస్సై భాస్కర్‌రెడ్డి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పెండ్లికి వెళ్లి వస్తుండగా...

మరికొద్దిసేపట్లో ఇంటికి చేరుకుంటారనగా అంతలోనే మృత్యువు వారిని కబళించింది. దుద్దెడ గ్రామానికి చెందిన జక్కుల మమత–అనిల్ కుటుంబం హుస్నాబాద్‌లో జరిగిన ఓ వివాహానికి వెళ్లివస్తుండగా రాంపూర్ క్రాసింగ్ వద్ద ఈ ప్రమాదం చోటుచేసుకుంది. ఈ ప్రమాదంలో మమత అక్కడికక్కడే మృతిచెందింది. ఆమె మృతితో బంధువుల రోదనలు దవాఖాన వద్ద మిన్నంటాయి.

బీజేపీకి ఓటేస్తే దేశం భద్రం

జహీరాబాద్ విజయ సంకల్పయాత్ర సభలో కేంద్రమంత్రి, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కిషన్‌రెడ్డి

జహీరాబాద్, ఫిబ్రవరి 28: దేశం పదికాలాల పాటు శాంతిభద్రతలతో బాగుండాలంటే బీజేపీ మళ్లీ కేంద్రంలో అధికారంలోకి రావాలని, మోదీ నాయకత్వం దేశానికి అవసరమని కేంద్ర మంత్రి, రాష్ట్ర బీజేపీ అధ్యక్షుడు కిషన్ రెడ్డి అన్నారు. బుధవారం జహీరాబాద్‌లో నిర్వహించిన విజయ సంకల్ప యాత్రలో ఆయన పాల్గొని మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీ తెలంగాణలో అధికారంలోకి రాగానే రియల్టర్లు, కంపెనీ యజమానులను బెదిరించి దోపిడీ చేస్తున్నదన్నారు. తెలంగాణలో దోపిడీ చేసిన డబ్బులు దేశంలోని పార్లమెంట్ ఎన్నికల్లో ఖర్చు చేసేందుకు కాంగ్రెస్ యత్నిస్తోందన్నారు. తెలంగాణ కాంగ్రెస్ నాయకులు ఎప్పుడూ కాళేశ్వరం ప్రాజెక్టు కోసం మాట్లాడుతున్నారు తప్ప అభివృద్ధి కోసం మాట్లాడడం లేదన్నారు. కాంగ్రెస్ పార్టీకి పార్లమెంట్‌లో 40 సీట్లు ఉన్నాయని, వచ్చే పార్లమెంట్ ఎన్నికల్లో 40 సీట్లు రావన్నారు. కర్ణాటకలో ఉన్న అన్ని ఎంపీ సీట్లు బీజేపీ గెలుపొందడం ఖాయమన్నారు. తెలంగాణలో ఉన్న 17 పార్లమెంట్ సీట్లు బీజేపీ విజయం సాధిస్తుందని ధీమా వ్యక్తం చేశారు. పిల్లల భవిష్యత్ కోసం పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీకి మద్దతు ఇవ్వాలన్నారు. హైదరాబాద్‌లో ఎంఐఎం ఎంపీ ఈసారి ఎన్నికల్లో ఓడిపోవడం ఖాయమన్నారు. దేశ రక్షణ కోసం మోదీ ప్రభుత్వం అధికారంలోకి రావడం ఖాయమని, ఏ గ్రామానికి వెళ్లినా మోదీ ప్రభుత్వం రావాలని ప్రజలు కోరుకుంటున్నట్లు కిషన్‌రెడ్డి తెలిపారు. సమావేశంలో జహీరాబాద్ పార్లమెంట్ ఇన్‌చార్జి, కామారెడ్డి ఎమ్మెల్యే వెంకట్‌రాంరెడ్డి, సంగారెడ్డి జిల్లా బీజేపీ అధ్యక్షురాలు గోదావరి అంజిరెడ్డి, బీజేపీ నాయకులు జైపాల్‌రెడ్డి, పైడి ఎల్లారెడ్డి, బీజేపీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

జహీరాబాద్‌లో విజయ సంకల్పయాత్ర సభలో మాట్లాడుతున్న కిషన్‌రెడ్డి

5న సంగారెడ్డికి ప్రధాని మోదీ

సంగారెడ్డిలో సభకు స్థలాన్ని పరిశీలిస్తున్న బీజేపీ నేతలు

సంగారెడ్డి, ఫిబ్రవరి 28(నమస్తే తెలంగాణ): ప్రధాని నరేంద్రమోదీ మార్చి 5న సంగారెడ్డి జిల్లాలో పర్యటించనున్నారు. మోదీ పర్యటనకు సంబంధించిన షెడ్యూల్ ఖరారైంది. అధికారుల సమాచారం మేరకు ప్రధాని మార్చి 4, 5 తేదీల్లో తెలంగాణలో పర్యటిస్తారు. 4న ఆదిలాబాద్ జిల్లాలో, 5న సంగారెడ్డి జిల్లాలో పర్యటించనున్నారు. ప్రధాని పర్యటనకు సంబంధించి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అధికారిక ఏర్పాట్లు చేపడుతున్నాయి. పార్లమెంట్ ఎన్నికలు సమీపిస్తున్న నేపథ్యంలో మోదీ పర్యటనపై బీజేపీ ప్రత్యేకంగా దృష్టిపెట్టింది. పార్లమెంట్ ఎన్నికల్లో పార్టీకి లబ్ధి చేకూర్చే రీతిలో ప్రధాని పర్యటన ఏర్పాట్లను బీజేపీ చేపడుతున్నది. 5న ప్రధాని మోదీ ఉదయం 10గంటలకు బేగంపేట ఎయిర్‌పోర్టులో దిగుతారు. అక్కడి నుంచి హెలికాప్టర్‌లో బయలుదేరి సంగారెడ్డికి చేరుకుంటారు. సంగారెడ్డిలో కేంద్ర ప్రభుత్వ నిధులతో చేపట్టిన పలు అభివృద్ధి పనులను ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనలు చేస్తారు. నాందేడ్–అకోలా రహదారి విస్తరణ పనులు పూర్తికావడంతో 5న ప్రధాని సంగారెడ్డిలో ప్రారంభిస్తారు. 65వ నెంబరు జాతీయ రహదారిని గంగారం నుంచి సంగారెడ్డిలోని పోతిరెడ్డిపల్లి చౌరస్తా వరకు ఆరులేన్ల పనులకు మోదీ శంకుస్థాపన చేసే అవకాశం ఉంది. వీటితో పాటు పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేయనున్నట్లు తెలిసింది. అనంతరం సంగారెడ్డిలో బీజేపీ నిర్వహించే బహిరంగ సభలో ప్రధాని పాల్గొననున్నారు. పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో సభను భారీ ఎత్తున నిర్వహించనున్నారు. మెదక్, జహీరాబాద్ పార్లమెంట్లతో పాటు హైదరాబాద్ పరిసర ప్రాంతాల నుంచి సభకు జనసమీకరణ జరిగేలా బీజేపీ దృష్టిపెట్టింది. బహిరంగ సభ నిర్వహించేందుకు అనువైన స్థలాలను బీజేపీ నేతలు బుధవారం సంగారెడ్డిలో పరిశీలించారు. బీజేపీ కామారెడ్డి ఎమ్మెల్యే వెంకటరమణారెడ్డి, రాష్ట్ర నాయకులు రుద్రమదేవి, సంగప్ప, బీజేపీ జిల్లా అధ్యక్షురాలు గోదావరిఅంజిరెడ్డి సంగారెడ్డిలోని అంబేద్కర్ స్టేడియం గ్రౌండ్‌తో పాటు సంగారెడ్డి శివారులోని రెండు బహిరంగ ప్రదేశాలను మోదీ సభ నిర్వహణ కోసం పరిశీలించారు. త్వరలో బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కిషన్‌రెడ్డి సంగారెడ్డికి వచ్చి మోదీ బహిరంగ సభ స్థలాన్ని ఖరారు చేయడంతో పాటు జనసమీకరణ ఇతర ఏర్పాట్లను పరిశీలించనున్నట్లు తెలిసింది.